# తగ్గుతున్న ఆర్టీసి బస్సులు

* పెరుగుతున్న ప్రయాణికులు
* డొక్కు బస్సుల కొనసాగింపు పెరుగుతున్న ప్రమాదాలు
* ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
* శివారు ప్రాంతాలలో ప్రయాణికుల అవస్థలు




**హైదరాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సులో ప్రయాణం చేయడం ప్రమాదరహితం అంటూ ఆర్టీసి అనేక ప్రకటనలు చేస్తున్నప్పటికి అందుకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయడంలో మాత్రం సరైనా ఉత్సాహం చూపడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. సుఖ ప్రయాణం సంగతి పక్కన పెడితే డొక్కుబస్సులలో వందల సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించడం వల్ల బస్సులు అతి తక్కువ సమయంలోనే షెడ్డుకు చేరక తప్పడం లేదు. అంతే కాకుండా మెట్రోస్టేషన్ల నుంచి సమీప కాలనీలు, బస్తీలకు ఫీడర్ సర్వీసులు నడుపుతామని గతంలో అధికారులు ప్రకటించినా ఇందుకు సంబంధించిన చర్యలు మాత్రం కనిపించడం లేదు. బస్సుల సంఖ్యను పెంచకపోవడం వల్ల ముఖ్యంగా నగర శివారు ప్రాంతాలలో ఆర్టీసి బస్సులలో ప్రయాణించేందుకు ఉత్సాహం చూపిస్తున్నప్పటికి ఆర్టీసీ మాత్రం బస్సులను ప్రయాణికులకు సరిపడా పెంచాల్సి ఉండగా అంతకంతకూ తగ్గిస్తూపోతోంది. దీంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల పైనే ఆధారపడుతున్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి అనేక ప్రాంతాలకు వెళ్లడానికి ఆర్టీసి సరిపడా బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక చార్జీలు చెల్లించి ప్రైవేట్ వాహనాల్లో ఆయా ప్రాంతాల వారు గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అత్యధిక ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల బస్సుల నాణ్యత, జీవిత కాలం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

**నానాటికి తగ్గుతున్న ఆర్టీసి బస్సుల సంఖ్య...**

రోజురోజుకు గ్రేటర్ హైదరాబాద్ విస్తరిస్తుండడంతో ప్రయాణికుల సంఖ్యకూడా అంతకంతకూ పెరిగిపోతోంది. ఇందుకు సరిపడా బస్సులు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. పైగా బస్సుల సంఖ్య నానాటికి తగ్గిపోతోంది. ఎనిమిది సంవత్సరాల కిందట మూడువేల ఎనిమిది వందల బస్సులు ఉండగా అనేక కారణాల వల్ల అవి కేవలం 3వేలలోపే ఉంది. బస్సుల సంఖ్య తగ్గడంతోపాటు బస్సు డిపోల సంఖ్యను అధికారులు తగ్గిస్తూపోతున్నారు. నగరంలో గతంలో డిపోల సంఖ్య 28 ఉండగా నేడు 25కు చేరుకున్నాయి. 2019 సంవత్సరంలో ఆర్టీసి అధికారులు పలు కారణాల చూపిస్తూ మూడు వేల ఎనిమిది వందల బస్సులు ఉండగా ఒక్కసారిగా వెయ్యి బస్సులను తగ్గించారు. దీంతో బస్సుల సంఖ్య 2800లకు చేరింది. ఈ రెండు, మూడు సంవత్సరాలలో అధికారులు రెండు వందల బస్సులు కొత్తగా సమకూర్చారు. ప్రస్తుతం కేవలం మూడువేల బస్సులతోనే ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నారు.

**శివారు ప్రాంతాల్లో తగ్గుతున్న ప్రయాణికుల సంఖ్య...**

నగర శివారు ప్రాంతాలలో నానాటికి ఆర్టీసి ప్రయాణికులు తగ్గుతున్నారు. ఆర్టీసి బస్సులు సరిపడా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలపై ఆధారపడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది. ఉదయం కార్యాలయాలకు, వ్యాపారాలు జరుపుకోడానికి, ఇతర పనుల కోసం నగర శివారు ప్రాంతాలకు చేరుకుంటారు. పనులు ముగిసిన అనంతరం సాయంత్రం సమయంలో వారివారి గమ్యస్థానాలకు చేరుకుంటారు. ఈ క్రమంలో ఉదయం, సాయంత్రం ఆర్టీసి బస్సులు సరిపడా అందుబాటులో లేని కారణంగా, కొన్ని సార్లు అందుబాటులో ఉన్నా కిక్కిరిన ప్రయాణికులు ఉండడంతో తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆలస్యంగా వచ్చే ఆర్టీసి బస్సుల కోసం ఎదురుచూసే సమయం లేకపోవడం, అత్యవసరంగా ప్రయాణించాల్సిన కారణంగా ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం అనివార్యం అవుతోంది. దీంతో ప్రయాణికుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ఎనిమిది సంవత్సరాల కిందటి వరకు ఆర్టీసి బస్సుల్లో దాదాపు 33 లక్షలకు పైగా ప్రయాణించేవారు నేడు కేవలం 20లక్షలకు కాస్త అటూఇటుగా ప్రయాణిస్తున్నారు. కేవలం ఎనిమిది సంవత్సరాల కాలంలోనే దాదాపు 13నుండి 14 లక్షల మంది ఆర్టీసి బస్సు ప్రయాణికులు తగ్గిపోయారు. ఎనిమది సంవత్సరాల కిందట ఉన్న జనాభా నిష్పత్తి బేరీజు వేస్తే దాదాపు 20లక్షల మంది ప్రయాణికులు తగ్గినట్లుగా భావించవ్చని ప్రయాణికులే చెబుతున్నారు. పైగా కాలం చెల్లిన బస్సులకే మరమ్మతులుచేస్తూ రోడ్లపైకి తీసుకువస్తున్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి బస్సులను ఇలాగే కొనసాగిస్తే ప్రమాదాలు ఎదుర్కోక తప్పదని రావాణారంగా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**బస్సులు పెంచాల్సిన అవసరం....**

నగర శివారు ప్రాంతాలలో అనేక కాలనీలు, బస్తీలు, వ్యాపార సంస్థలతోపాటు విద్యాసంస్థలు విపరీతంగా పెరుగుతున్నారు. ఇందుకు తోడుగా జనాభా కూడా పెరిగిపోతోంది. అలాగే వారికి ప్రయాణ అవసరాలు విపరీతంగా పెరిగిపోతోంది. వారి అవసరాలు తీర్చాలంటే ఆర్టీసి బస్సుల సంఖ్య గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న బస్సులతో కాలం వెల్లదీస్తే కొన్ని నెలల్లోనే బస్సులు షెడ్డుకు చేరకతప్పదు. అధికారులు అత్యవసరంగా బస్సుల సంఖ్యను పెంచితే తప్ప ప్రజా రవాణా అవసరాలు తీరే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఆందుబాటులో ఉన్న బస్సులకు తోడు మరో నాలుగైదు వేల బస్సులు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. అత్యవసరంగా కనీసం మరో మూడు వేల బస్సులను పెంచకపోతే రానున్న రోజుల్లో ప్రైవేట్ ప్రయాణ వ్యవస్థ ఆదిపత్యం కొనసాగక తప్పదని రవాణా రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్టీసి మనుగడకు ఇది అవసరమని అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్ వార్త



# రైళ్లలో బెర్త్‌ల దందా..!

◆ రైళ్లలో కొందరు టిసిల చేతివాటం ◆ వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు బెర్త్ విక్రయాలు



**హైదరాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త:** ఏసీ బెర్త్‌కు రూ.1000.. నాన్ ఏసీ బెర్త్ రూ. 500. ఇవి టికెట్ చార్జీలు కాదు. వెయిటింగ్ లిస్ట్ ప్రయాణీకులు బెర్తులుకావాలంటే టికెట్ కలెక్టర్లకు (టీసీలకు) సమర్పించుకోవలసిన ఆమ్యామ్యాలు. ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉన్న రైళ్లు, కొన్ని ప్రత్యేక రైళ్లలో ఈ తరహా బేరాలు జోరుగా సాగుతున్నాయి. టీసీలే స్వయంగా డబ్బులు తీసుకొని బెర్తులు కట్టబెట్టడంతో వెయిటింగ్‌లిస్ట్‌లో ఉన్న వారు నిశ్చింతంగా ప్రయాణం చేస్తున్నారు. నిజానికి టికెట్ నిర్ధారణ అయితే తప్ప ట్రైన్‌లో ప్రయాణం చేసేందుకు అవకాశం లేదు. ప్రతి ట్రైన్ బయలుదేరడానికి 4 గంటల ముందు ప్రయాణికుల జాబితా విడుదల అవుతుంది. ఆ జాబితాలో ఉన్నవాళ్లు మాత్రమే రిజర్వేషన్ లభించిన ప్రయాణికులు, కానీ ప్రతి ట్రైన్‌కు వందల సంఖ్యలో వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులు ఉంటారు. చార్ట్ (జాబితా) సిద్ధమైన తరువాత వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులు తమ టికెట్లను రద్దు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినవారికి టికెట్ డబ్బులు వారి ఖాతాలోకి ఆటోమేటిక్‌గా రీఫండ్ అవుతాయి. కానీ కొందరు ప్రయాణికులు వెయిటింగ్ లిస్ట్ టికెట్లపైనే ప్రయాణం చేస్తారు. ఏదో ఒకవిధంగా వెళ్లిపోవాలనే ఉద్దేశంతో టికెట్లను రద్దు చేసుకోకుండా ప్రయాణాన్ని కొనసాగిస్తారు. డిమాండ్, రద్దీ ఎక్కువగా ఉన్న రైళ్లలో ఈ తాకిడి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులపైనే కొందరు టీసీలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. నాన్ ఏసీ స్లీపర్ బోగీల్లో బెర్తులకు కొంత చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి అయ్యప్ప భక్తులు పెద్దఎత్తున శబరిమలకు తరలివెళ్తున్నారు. కొంత మంది సాధారణ భక్తులు సైతం దర్శనానికి వెళ్తున్నారు. దీంతో ప్రతిరోజు రాకపోకలు సాగించే శబరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు ప్రత్యేక రైళ్లకు డిమాండ్ బాగా ఉంది. రోడ్డు మార్గంలో వెళ్లాలన్నా, ఫ్లైట్లో వెళ్లాలన్నా పెద్ద మొత్తంలో వెచ్చించ వలసి ఉంటుంది. చార్జీల భారం దృష్ట్యా ఏదోఒక విధంగా రైళ్లలో వెళ్లడమే మంచిదని భావించే వెయిటింగ్‌లిస్ట్ ప్రయాణికుల అవసరాన్ని కొందరు టీసీలు సొమ్ము చేసుకుంటున్నారు. నగరంలోని అంబర్‌పేటకు చెందిన నలుగురు స్నేహితులు సికింద్రాబాద్ నుంచి శబరికి బయలుదేరారు. వాళ్ల ప్రయాణానికి ఇంచుమించు నెల రోజుల క్రితం థర్డ్ ఏసీ రిజర్వేషన్ కోసం టికెట్లు కొనుగోలు చేశారు. కానీ ప్రయాణ తేదీ నాటికి టికెట్లు నిర్ధారణ కాలేదు. రిజర్వేషన్ లభించ లేదు. చార్ట్ (ప్రయాణికుల జాబితా) సిద్ధమైన తరువాత కూడా ఆ ప్రయాణికులు అదే ట్రైన్లో బయలుదేరారు. రైలు ప్రారంభమైన కొద్దిసేపటికి వెళ్లి టీసీని సంప్రదించారు. మొదట్లో ఎలాంటి గ్యారంటీ ఇవ్వకపోయినప్పటికీ ట్రైన్ తిరుపతికి చేరుకున్న తరువాత ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.1000 చొప్పున నాలుగు బెర్తులు కేటాయించాడు. థర్డ్ ఏసీలోనే ఆ సదుపాయం లభించడంతో ప్రయాణం నిశ్చింతగా సాగింది అని ఆ ప్రయాణికులు చెప్పారు. తమతో పాటు మరి కొందరికి బోగీల్లో రూ.500 చొప్పున తీసుకొని స్లీపర్ బెర్తులు ఇచ్చినట్లు వారు చెప్పారు.

**ఎలా సాధ్యం...**

రిజర్వేషన్లు నిర్ధారణ అయిన ప్రయాణికులు ఆకస్మికంగా ప్రయాణాలను రద్దు చేసుకోవచ్చు. అలాంటి వాళ్ల సంఖ్య తక్కువగానే ఉంటుంది. ట్రైన్లో విధులు నిర్వహించే టికెట్ ఎగ్జామినర్, టికెట్ కలెక్టర్, తదితర సిబ్బంది. ఎప్పటికప్పుడు ప్రయాణికుల వివరాలను తమవద్ద ఉండే హ్యాండ్ హెల్త్‌మిషన్లలో నమోదు చేయాలి. ఈ క్రమంలోనే కొందరు టీసీలు ఇలాంటి ప్రయాణికుల వివరాలను నమోదు చేయడంలోనే తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. సదరు ప్రయాణికుల పేరు వద్ద కాన్సిల్ అని కాకుండా జాయిన్ అని నమోదుచేసి ఆ బెర్తులను వెయిటింగ్ లిస్ట్ వాళ్లకు కేటాయిస్తున్నారు. అయితే ఆన్‌లైన్ టికెట్ పైన ఇది సాధ్యంకాదు. రిజర్వేషన్ కేంద్రాల్లో కొనుగోలు చేసిన వెయిటింగ్ లిస్ట్ టికెట్లపైనే టీసీలు ఈ తరహా ప్రయోగాలు చేస్తున్నట్లు సమాచారం.

# నెక్లెస్ రోడ్‌లో 'సంవిధాన్ శక్తి' పేరిట రన్




**హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త** నగరంలోని నెక్లెస్ రోడ్‌లో 'సంవిధాన్ శక్తి పేరిట రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక పాల్గొన్నారు. ఏక్‌నయా దిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3కె, 5కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ నగేశ్ భీమపాక మాట్లాడారు. "మీ పేరు ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదైతే మీ బంగారు భవిష్యత్ నాశనం అవుతుంది. భవిష్యత్ బంగారుమయం చేసుకోవాలంటే చెడు వ్యసనాలకు దూరం ఉండాలి. డ్రగ్స్ పెడ్లర్‌గా యువతను మార్చడమే లక్ష్యంగా కొన్ని ముఠాలు ఉంటాయి. యువత వాటి బారినపడొద్దు. మెడిటేషన్ చేస్తే అన్ని డ్రగ్స్‌ను మించిన కిక్ ఉంటుంది. చిన్నపిల్లలకు కూడా డ్రగ్స్ అలవాటు చేస్తున్న వారిని చూస్తే ఆందోళన కలుగుతోంది. పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు అప్రమత్తంగా ఉండాలి" అని అన్నారు.




## వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్

**431మందిపై కేసులు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు**

**పలువురికి జరిమానాలతో పాటు జైలు శిక్ష**

**హైదరాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త :** మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాల కారణంగా..అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు, కోర్టులు కొరడా ఝుళిపిస్తున్నాయి. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 431 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. వీరిలో 325 ద్విచక్ర వాహనదారులు, 16 ఆటోలు, 86 కార్లు, 4 భారీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్(బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే.. 378 మంది 35ఎంజి/100 ఎంఎల్ నుంచి 200ఎంజి/100 ఎంఎల్ మధ్య, 42మంది 201 ఎంజి/100ఎంఎల్ నుంచి 300 ఎంజి/100 ఎంఎల్ మధ్య, 11 మంది 301 ఎంజి/100 ఎంఎల్ నుంచి 550ఎంజి/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసుల అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తీవ్రమైన నేరమని పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత-2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.

## నకిలీ ఐఎఎస్, ఐపిఎస్‌పై మరో కేసు నమోదు

**జూబ్లీహిల్స్, నవంబరు 30, ప్రభాతవార్త:** నకిలీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారిగా అవతారమెత్తిన నందికొట్కూర్‌కు చెందిన బత్తిని శశికాంత్‌పై మధురానగర్ పోలీస్ స్టేషన్లో మరో కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. మాదాపూర్ ప్రాంతంలో నివసించే సీఏ కె. కోటేశ్వర్ రావు కమలాపురికాలనీ ఫేజ్-2 ప్రాంతంలో తన కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. సిద్దూ అనే క్లయింట్ ద్వారా నకిలీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారిగా చలామణి అవుతున్న శశికాంత్ కేంద్ర హోంశాఖలో అధికారిగా పనిచేస్తున్నట్లు నమ్మించాడు. 2023లో తనకు తక్కువ ధరలో ఎస్సార్ నగర్ ప్రాంతంలో ఒక ప్లాట్ అమ్మకానికి వచ్చిందని, తనకు రూ. 50 లక్షలు సమకూరిస్తే నాలుగు నెలల్లో తిరిగి ఇచ్చేస్తానని నమ్మించాడు. అతడి మాటలను నమ్మి రూ.30 లక్షలను శశికాంత్ సూచన మేరకు అతడి గన్‌మెన్ విమలారాజ్ బ్యాంకు ఖాతాలోకి కోటేశ్వరరావు బదిలీ చేశారు. మరో రూ.10 లక్షలను నగదు రూపంలో ఇచ్చారు. గడువు ముగిశాక ఎన్నిసార్లు డబ్బులు అడిగినా వాయిదా వేస్తూ వచ్చాడు. ఇటీవల ఫిలింనగర్ పోలీసులు శశికాంత్‌ను అరెస్ట్ చేసిన విషయాన్ని తెలుసుకున్న కోటేశ్వర్ రావు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి ఒక యువకుడి ఆత్మహత్య

**ఉప్పల్, నవంబరు 30 ప్రభాతవార్త :** ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడిన ఒక యువకుడు డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎ స్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. ఉప్పల్ శాంతినగర్‌లో నివసించే చంద్రయ్య కుమారుడు పొలడుగు సాయి (24) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే కొంత కాలంగా అన్‌లైన్‌లో బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. దీంతో పలుచోట్ల అప్పులు చేసి తీర్చలేక మనస్థాపం చెంది ఈనెల 29వ తేదీన పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. బంధువులు వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొంద ుతూ ఆదివారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గాజుల వ్యాపారిని కత్తితో బెదిరించి రూ. 40 లక్షల రూపాయలు దోచుకెళ్లిన దుండగులు

**చార్మినార్, నవంబరు 30 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలో ఓ గాజుల వ్యాపారిని కత్తితో బెదిరించి నలభై లక్షల రూపాయలను గుర్తు తెలియని ఇద్దరు దుండగులు దోచుకెళ్లిన సంఘటన ఆదివారం భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి కథనం ప్రకారం...బీహార్ రాష్ట్రానికి చెందిన సుల్తాన్ బతుకు దెరువు కోసం హైదరాబాద్ పాతబస్తీ వచ్చి తలాబ్‌కట్టలో స్థిరపడ్డాడు. సుల్తాన్ తలాబ్‌కట్టలో గాజుల వ్యాపారం చేస్తున్నాడు. పాతబస్తీలోని దుకాణాలకు గాజులకు సంబంధించిన మెటీరియల్స్‌ను సుల్తాన్ సరఫరా చేస్తుంటాడు. కాగా సుల్తాన్ భార్య కొద్దిరోజుల క్రితర కాన్పు కోసం కలకత్తాకు వెళ్లింది. సుల్తాన్ ఒక్కడే ఇంటిలో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం ఐదు గంటల సమయంలో గుర్తుతెలియని ఇరవై ఐదు నుంచి ముప్పై సంవత్సరాల వయస్సుగల ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి సుల్తాన్ ఇంటికి వచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు సుల్తాన్ ఇంటి తలుపులు తెరవాలని తలుపుకొట్టారు. ఇంటిలోని చెత్తను తీసుకెళ్లటానికి వచ్చి ఉండ వచ్చునని భావించిన సుల్తాన్ తలుపులు తెరిచారు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి గాజుల వ్యాపారి సుల్తాన్ నోరు మూసి వేసి కత్తి పిడితో దాడి చేసి బెదిరించారు. ఇంట్లో దాచిన రూ. 40 రూపాయలను దుండగలు తీసుకుని పారిపోయారు. దుండగులు వెళ్లే సమయంలో సుల్తాన్ ఫోన్‌తో పాటు ద్విచక్ర వాహనాన్ని కూడ తీసుకుని వెళ్లి పోయారు. గాజుల వ్యాపారి సుల్తాన్ ఫిర్యాదు మేరకు భవానీనగర్ పోలీసులు ఈ కేసును అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫైనాన్షియర్ వేధింపులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

**అత్తాపూర్ నవంబరు 30, ప్రభాతవార్త :** ఫైనాన్షియర్ వేధింపులు తట్టు కోలేక వ్యక్తి ఆత్మహత్య చేసేసుకున్న ఘటన మైలర్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శాస్త్రీపురం డైమండ్ హిల్స్‌లో కొంతకాలంగా నివసించే మృతుడు షేక్ ఇమ్రాన్ (38) నాంపల్లికి చెందిన ఫైనాన్షియర్‌లు జంగీర్, సోహెల్‌లవద్ద కొంత డబ్బు అప్పుగా తీసుకున్నారు. ఇమ్రాన్ తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చిన ఇంకా వడ్డీ డబ్బులు ఇవ్వాలని ఫైనాన్షియర్‌లు వేధించడంతో తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో షేక్ ఇమ్రాన్ సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కులు

* ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి చేసేలా ప్రణాళికలు..
* ఉమెన్ ఎంపవర్ మెంట్ ఇంటి నుంచే మొదలవ్వాలి
* వీ ఎనేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుకలో మంత్రి శ్రీధర్ బాబు




గ్రాడ్యుయేషన్ వేడుకల్లో మహిళలతో మంత్రి శ్రీధర్‌బాబు.

**జూబ్లీహిల్స్, నవంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్య సాధనలో మహిళలను కీలక భాగస్వామ్యం చేస్తామన్నారు. వీ హబ్ ఆధ్వర్యంలో ఆదివారం జూబ్లీహిల్స్ లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన వీ ఎనేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళా సాధికారత పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చాలంటే మార్పు అనేది ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. ఇప్పుడిప్పుడే సమాజంలో ప్రగతిశీల మార్పు కనిపిస్తుందని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామన్నారు. తెలంగాణలో మహిళా శ్రామికశక్తి భాగస్వామ్య రేటు 52.7 శాతం అని, ఇది జాతీయ సగటు 45.2 శాతం కంటే ఎక్కువగా నమోదు కావడం రాష్ట్ర పురోగతిని ప్రతిబింబిస్తోందన్నారు. పురుషులకు ధీటుగా మహిళలు వ్యాపారాలు ప్రారంభించి విజయవంతంగా నిర్వహించగలరని వీ హబ్ నిరూపించిందన్నారు. ఈ స్ఫూర్తితో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ప్రారంభించే స్టార్టప్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో ఎంటర్ ప్రైజెస్‌గా మార్చేలా వీ హబ్ 2.0కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ వేదిక ద్వారా ఒకేచోట స్కిల్స్, టెక్నాలజీ, ఫైనాన్స్, మార్కెట్, మెంటార్‌షిప్ అందుబాటులో ఉండేలా ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తామన్నారు. మహిళల ఆలోచన తీరులోనూ మార్పు రావాలని, ఉద్యో గాల కోసం కాకుండా వాటిని సృష్టించేలా కొత్తగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ క్రీడాకారిణి జ్వాలగుప్తా, ఫిలిం ప్రొడ్యూసర్ ప్రియాంకదత్, వీ హబ్ సీఈవో సీతా పల్లచోల్ల తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన భారతీయ కళా మహోత్సవం

**అల్వాల్, నవంబరు 30 ప్రభాతవార్త:** బొల్లారం రాష్ట్రపతినిలయంలో భారతీయ కళా మహోత్సవం ఆదివారంతో ముగిసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 21 శుక్రవారం ఉత్సవాన్ని ప్రారంభించడం జరిగింది. పశ్చిమ్ కి పరంపర అనే థీమ్‌తో అంగరంగ వైభవంగా సాగింది కళా ఉత్సవం. పశ్చిమ భారత రాష్ట్రాలు అయిన రాజస్థాన్, మహారాష్ట్ర, గోవా, గుజరాత్, డమన్ అండ్ డయ్యూ, దాద్రా తదితర రాష్ట్రాలు దేశంలోని నుంచి వచ్చిన వందలాది మంది కళాకారులు ఆకట్టుకొనగా చేతి వృత్తులకు చెందిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దక్షిణాది వాసులకు పెద్దగా పరిచయం లేని సంస్కృతి సాంప్రదయాలను కళ్లారా చూసే అవకాశం నగర వాసులకు లభించింది.

ప్రతి రోజు వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు, కళాకారులుతో రాష్ట్రపతి నిలయం నూతన శోభను సంచరించుకుంది. ఆఖరి రోజు 34,500 మంది ఉత్సవంలో పాలు పంచుకోవడం విశేషం. ముగింపు ఉత్సవానికి ముఖ్య అతిధులుగా రాష్ట్రపతి కార్యదర్శి డాక్టర్ సునీష్ విచ్చేశారు.

కళా మహోత్సవం బొల్లారం రాష్ట్రపతి నిలయం మేనే జర్ రజనిప్రియ పర్యవేక్షణలో జరిగింది. కేంద్రీయ సాంస్కృతిక, పర్యాటక, జౌళి శాఖలు సంయుక్తంగా బొల్లారం రాష్ట్రపతి నిలయం సహ కారంతో కళా మహోత్సవాన్ని నిర్వహించాయి.



కళా మహోత్సవంలో నృత్య ప్రదర్శన




కళాకారులకు జ్ఞాపిక అందిస్తున్న రాష్ట్రపతి నిలయం మేనేజర్ రజని ప్రియ

# గ్రామాల్లో మొదలైన ఎన్నికల సమరం

-డిసెంబరు 14న 13 పంచాయ తీలకు ఎన్నికలు
-13 సర్పంచులు, 112 వార్డులకు ఎన్నికలు
-ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

**ఆమనగల్లు, నవంబరు30, ప్రభాతవార్త:** గ్రామాలలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలయింది. రెండవ విడతలో ఆమనగల్లు మండలంలోని 13 గ్రామపంచాయతీలకు గాను 13 సర్పంచు, 112 వార్డు స్థానాలకు ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నది. డిసెంబరు 14న జరిగే పోలింగ్ కొరకు నవంబరు 30 నుండి డిసెంబరు2 వరకు నామినేషన్ల దరఖాస్తుల స్వీకరించనున్నారు. మండల పరిధిలోని ఆకుతోటపల్లి, శెట్టిపల్లి, సింగంపల్లి, పోలెపల్లి, కొత్తకుంటతండా, చెన్నంపల్లి, మేడిగడ్డ, శంకర్‌కొండతండా, మంగళపల్లి, చింతలపల్లి, రాంనుంతల, కోనాపూర్, సీతారాం నగర్‌తండా పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల స్వీకరణకు నాలుగు ప్రాంతాల్లో ఆకుతోటపల్లి, పోలెపల్లి, ఆమనగల్లు, కోనాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఆకుతోటపల్లిలో ఆకుతోటపల్లి, శెట్టిపల్లి పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయగా, పోలెపల్లి గ్రామంలో సింగంపల్లి, పోలెపల్లి, కొత్తకుంటతండా, చెన్నంపల్లి పంచాయతీలకు, మంగళపల్లి, చింతలపల్లి, మేడిగడ్డతండా, శంకర్‌కొండతండాకు



నామినేషన్ దాఖలు కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మండల ఎన్నికల అధికారి కుసుమ మాధురి

ఆమనగల్లు పట్టణంలోని ఎంఆర్‌సి, ఎంపిడిఓ కార్యాలయాల్లో, కోనాపూర్ గ్రామంలో కోనాపూర్, సీతారాం నగర్‌తండా, రాంనుంతల పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటిరోజు ఆదివారం పలు కేంద్రాల్లో అభ్యర్థులు నామినేషన్ల ను హంగుహార్బాటాలకు చోటులేకుండా నిరాడంబరంగా వేశారు.

**నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన డిసిపి రాజేశ్....**

ఆమనగల్లు పట్టణంలోని ఎంఆర్‌సి భవనంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆదివారం శంషాబాద్ డీసీపీ రాజేశ్



ఆమనగల్లులో నామినేషన్ దాఖలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిసిపి రాజేశ్

పరిశీలించారు. షాద్‌నగర్ ఏసిపి లక్ష్మినారాయణతో కలిసి ఆయన నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాలు, పరిసరాలను ఆయన పరిశీలించారు. మండల పరిధిలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాలను ఆమనగల్లు సిఐ జానకిరాంరెడ్డి, ఎస్సై బి, వెంకటేశ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తు పోలీసు సిబ్బంది సంఖ్యను డీసీపికి వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం, ఎన్నికల నిబంధలకు విరుద్దంగా వ్యవహరించే వారిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీపి రాజేశ్ సూచించారు.




నిట్ట నుండి నామినేషన్ పత్రాలను స్వీకరిస్తున్న ఆర్ఒ రామలక్ష్మీ

## ఆకుతోటపల్లి సర్పంచ్ పదవికి నిట్ట నామినేషన్

**ఆమనగల్లు, నవంబరు30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి సీనియర్ రాజకీయ నాయకుడు, అధికార పార్టీ నేత నిట్టనారాయణ ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. ఆకుతోటపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి జనరల్ స్థానానికి రిజర్వేషన్ కేటాయించిన విషయం అందిరికి తెలిసిందే. పంచాయతీ పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన నిట్టనారాయణ ఉమ్మడి ఆమనగల్లు మండల పరిషత్ వైస్‌ఎంపిపిగా పనిచేశారు. అనంతరం ఆకుతోటపల్లి ఎంపిటిసిగా ఆయన సతీమణి నిట్టమంగమ్మ గెలుపొందారు. సుధీర్ఘ రాజకీయ అనుభవం కల్గిన నిట్ట ఆకుతోటపల్లి పంచాయతీ సర్పంచ్ పదవికి అధికార పార్టీ మద్దతుతో బరిలో నిలుస్తున్నట్లు నిట్ట తెలిపారు. మొదటిరోజు హంగుహార్బటం లేకుండా నిట్ట సంప్రదాయంగా నామినేషన్ వేశారు. ఎమ్మెల్యే సమక్షంలో పార్టీ శ్రేణులతో కలిసి మరోసారి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన ప్రభాతవార్తకు తెలిపారు.



రాంనుంతల సర్పంచు అభ్యర్థి నుండి నామినేషన్ స్వీకరిస్తున్న ఆర్ఓ దూసకంటి శ్రీధర్

## సర్పంచ్‌కు 11, వార్డులకు 17 నామినేషన్లు....

**ఆమనగల్లు, నవంబరు30, ప్రభాతవార్త:** డిసెంబరు14న జరిగే పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల దాఖల పర్వం ప్రారంభమైంది. మండల పరిధిలోని 13 గ్రామపంచాయతీలకు 13 సర్పంచు, 112 వార్డు స్థానాలకు రెండవ విడతలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సర్పంచు, వార్డు పదవులకు నవంబరు 30 నుండి డిసెంబర్2 వరకు ఎన్నికల అధికారులు అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీకరణను చేపట్టారు. మండల వ్యాప్తంగా మొదటిరోజు ఆదివారం 13పంచాయతీలలో 11మంది సర్పంచు అభ్యర్థులు, 17 వార్డు అభ్యర్థుల నుండి అధికారులు నామినేషన్లు స్వీకరించారు. ఆకుతోటపల్లి పంచాయతీ సర్పంచు పదవికి ఒకటి, వార్డు స్థానాలకు 3, చెన్నంపల్లి సర్పంచుకు 3, వార్డులకు 6, చింతలపల్లి సర్పంచుకు 1, వార్డుకు 2, రాంనుంతల సర్పంచు 1, వార్డుకు 0, కోనాపూర్ సర్పంచు 1, వార్డుకు 0, మంగళపల్లి సర్పంచు 1, వార్డు 2, పోలెపల్లి సర్పంచు 1, వార్డు 3, శెట్టిపల్లి సర్పంచు 1, వార్డు 0, శంకర్‌కొండతండా సర్పంచు 0, వార్డు 1, సింగంపల్లి సర్పంచు 1, వార్డు 0 నామినేషన్లు దాఖలయినట్లు ఎన్నికల అధికారి కుసుమమాధురి తెలిపారు.



## కడ్తాల్ బిఆర్ ఎస్ సర్పంచి అభ్యర్థిగా బావండ్లపల్లి ఆనంద్ నామినేషన్

**కడ్తాల్, నవంబరు30, ప్రభాతవార్త:** కడ్తాల్ బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా మాజీ వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్ మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ సమక్షంలో నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జడ్పీటిసి దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మి నరసింహ రెడ్డి, బిఆర్ ఎస్ నాయకులు రామకృష్ణ, గంప శ్రీను, నర్సింహా, లయక్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి రోజు 35 సర్పంచ్ నామినేషన్ల దాఖలు



నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారులు

**ధారూరు, నవంబరు30, ప్రభాతవార్త:** రెండో విడతల ఎన్నికల కోసం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ధారూర్ మండలంలోని 34 గ్రామపంచాయతీలకు సంబంధించి 10 నామినేషన్ల క్లస్టర్ల ు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే, ఆదివారం మండల వ్యాప్తంగా 35 సర్పంచ్ నామినేష న్లు, 286 వార్డులకు గా ను 17 వార్డు సభ్యులు నామినేషన్ల దాఖలు చేశారని ఎంపీడీవో నర్సింలు తెలిపారు. ఇదిలా ఉండగా నామినేషన్ వేయడానికి పలు క్లస్టర్ల వద్దకు ర్యాలీలు తీసుకుంటూ వచ్చారు.

## మర్పల్లిలో నామినేషన్ పర్వం ప్రారంభం

**మర్పల్లి , నవంబరు30, ప్రభాతవార్త:** మర్పల్లి మండలంలో రెండవ విడుత సర్పంచ్ ఎన్నికలకు గాను ఆదివారంనాడు మర్పల్లి మండలంలో నామినేషన్ పర్వం ప్రారంభమైయింది మండలంలో 29 గ్రామ పంచయాతిలుండగా ఆదివారం నాడుసర్పంచ్ పదవులకు గాను 26 నామినేషన్‌లు రాగా వార్డు మెంబర్లకు 21 నామి నేషన్లు వచ్చినట్లు మర్పల్లి ఎంపిడిఓ రాజారాం ఓ ప్రకటనలో తెలిపారు. నామినేషన్లకు మరో రెండు రోజులు గడువు ఉండడంతో నేటి నుండి అధికంగా నామినేషన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.ఇరు పార్టీల్లో ఆశావాహులు యువకులు అధికసంఖ్యలో ఉత్స హం చూపుతున్నారు.

## మొదటి రోజు నామినేషన్ల వెల్లువ



వెల్చాల్ క్లస్టర్ గ్రామ పంచాయతి కార్యాలయంలో నామినేషన్ పత్రాలు స్వీకరిస్తున్న ఎంపిడిఓ సృజన సాహిత్య

**మోమిన్‌పేట్, నవంబరు30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రెండవ విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మోమిన్ పేట్ మండల పరిధిలోని 29 గ్రామపంచాయతీలకు గా ు 29, మంది సర్పంచులగా, 49, మంది వార్డు సభ్యుల స్థానాలకు ప్రశాంతంగా నామినేష న్లు దాఖలు వేసినట్లు ఎంపిడిఓ సృజన సాహిత్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ యాదగిరి, ఆయా గ్రామాల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పంచాయతి కార్యదర్శులు, కారోబార్లు, పంచాయతి సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొదటిరోజు 19 పంచాయితీలకు 25 నామినేషన్లు




**మొయినాబాద్, నవంబరు30, ప్రభాతవార్త:** మొయినాబాద్ మండలంలోని 19 పంచాయితీలకు సర్పంచ్ ఎన్నికలకు మొదటి రోజు సర్పంచ్ 25 నామినేషన్‌లు, మొత్తం వార్డు మెంబర్లు, 166కు 53 వార్డు మెంబర్ల నామినేషన్‌లు వచ్చాయని మొయినాబాద్ ఎన్నికల అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటి అధికారి సంధ్య తెలిపారు, మొయినాబాద్ మండలంలో 19 గ్రామ పంచాయితీల నామినేషన్‌లకు 5 క్లస్టర్‌లను ఏర్పాటుచేశారు, కనకమామిడి, చిన్నమంగళారం, చందానగర్, శ్రీరామ్‌నగర్, బాకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసి నామినేషన్లు స్వీకరించడం జరిగిందన్నారు, మంగళవారం వరకు నామినేషన్లు స్వీకరించబడుతాయని గుర్తుచేశారు, ఎన్నికల్లో పోటిచేస్తున్న ప్రతి అభ్యర్ది నూతన ఏదైనా నేషనల్ బ్యాంక్ అకౌంట్‌ను తీసి ఎన్నికల నామినేషన్ పత్రాలతో పాటు జతపరిచి ఇవ్వాలన్నారు, ఏ అకౌంట్ నంబర్ జతపరుస్తారో ఎన్నికల నియమావాళిప్రకారం సర్పంచ్ ఎన్నికల వ్యాయం జతపరిచిన అకౌంట్ ద్వార జరగాలని గుర్తుచేశారు, 5వేల ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న పంచాయితీలు సర్పంచ్‌ఎన్నికల వ్యాయం 2లక్షల యాభైవేలు, వార్డు మెంబర్లు 50 వేలు మంచకూడదు, 5వేల ఓటర్ల కంటే తక్కువ ఉన్న పంచాయితీలు 1 లక్షా యాభైవేలు, వార్డు మెంబర్లు 30వేలు మించకుండా ఎన్నికల నియమావాళి నిభందనను పాటించాలన్నారు,

## క్రీడా పోటీలలో సరస్వతి శిశుమందిర్ విద్యార్థుల ప్రతిభ

**ఉప్పల్, నవంబరు 30 ప్రభాతవార్త :** శ్రీ సరస్వతి విద్యా పీఠం ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో ఉప్పల్ శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఉప్పల్ శిశుమందిర్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న బర్ల దక్షిత విశేష ప్రతిభ కనబరిచారు. 400 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్ పోటీల లో ప్రథమ బహుమతి పొందినట్లు పాఠశాల కోశాధికారి ఉప్పోజి బల్వంతాచారి తెలిపారు ఈ సందర్భంగా పాఠశాల ప్రబంధాకరిని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. విద్యార్థులకు తగు సహకారం అందిస్తున్నామని తెలిపారు. విజేతలను పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ

**సరూర్‌నగర్, నవంబరు 30 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్‌లో ఆదివారం అయ్యప్పస్వామి 18వ మెట్టు మహాపడి పూజోత్స వం ఘనంగా జరిగింది. గ్రామంలోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్స్‌లో పోశంబావి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పడి పూజోత్స వాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, పెద్దబావి బాబు, మౌనికా సుదర్శన్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు.

## చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం

**హైదరాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త :** చెరువులో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మ బండ చెరువులో ఆదివారం గుర్తు తెలియని మహిళా మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పూర్తిగా కుళ్లిపోయిన స్థితి లో ఉన్న మృతదేహం 40-45 ఏళ్ల వయస్సుగల మహిళకు చెందినదని, ఆమె ఒంటిపై మెట్టెలు, పట్ట గొలుసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నీలం రంగు చీర, నలుపు రంగు బ్లౌజ్ ధరించి ఉన్న మృతదేహం వారం రోజుల క్రితం మరణించి ఉండవచ్చని కూకట్‌పల్లి పోలీసులు తెలియజేశారు. మృతురాలి వివరాలు తెలిసినవారు 9490617123, 8712568374 ఫోన్‌నెంబర్ల ద్వారా సంప్రదించవచ్చని సిఐ సుబ్బారావు కోరారు.



శ్రీగురు తేగ్ బహాదూర్ మహారాజ్ 350వ శహీద్ దివస్ సందర్భంగా నిర్వహిస్తున్న ప్రార్థనలు

## గురుతేజ్ బహదూర్ మహారాజ్ చేసిన త్యాగం మరువలేనిది

**ముషీరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** సమాజంలో ప్రతి మతానికి స్వేచ్ఛ ఇవ్వటానికి, హక్కులను కాపాడడానికి గురుతేగ్ బహదూర్ మహారాజ్ చేసిన త్యాగం మరువలేనిదని పలువురు సిక్కు భక్తులు కొనియాడారు. ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో గురుద్వారా సీతాఫల్మండి ప్రబంధక కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గురుద్వారాల సహకారంతో తొమ్మిదవ సిక్కు గురువు శ్రీగురు తేగ్ బహదూర్ మహారాజ్ 350వ శహీద్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సిక్కు భక్తులు పాల్గొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హింద్ ది చాదర్‌గా ప్రసిద్ధి పొందిన గురు తేగ్ బహదూర్ మహారాజ్ చూపిన జాతీయ ఐక్యత,శాంతి, సహోదర భావం, ధర్మ పరిరక్షణ వంటి విలువలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్‌లు హర్పాల్ సింగ్, కన్వన్ సింగ్, అధ్యక్షులు ప్రతాప్‌సింగ్, ఉపాధ్యక్షులు రాజేందర్ సింగ్, ప్రధాన కార్యదర్శి రంజీత్‌సింగ్, సంయుక్త కార్యదర్శి జగ్జీత్ సింగ్, యూఎస్ఏ నుంచి అనంత్‌వీర్ సింగ్, ఆస్ట్రేలియా నుంచి భాయి గురుదేవ్‌సింగ్, అంబాలా నుంచి జ్యోతి శేర్ సింగ్ పాల్గొన్నారు. ప్రముఖ రాగి జథాలు శబద్ కీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకువెళ్లాయి.

## కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోను దగ్ధం చేసిన బిసి పొలిటికల్ ఫ్రంట్



కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోను దగ్ధం చేస్తున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు

**హైదరాబాద్ నవంబరు 30 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను బీసీ పొలిటికల్ ఫ్రెండ్ నాయకులు దగ్ధం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో బీసీల రాజకీయ జీవితాలకు బస్మాసుర హస్తంగా మారిందని బిసి పొలిటికల్ ఫ్రంట్ నేతలు ఆయిల్ వెంకన్నగౌడ్, బైరశేఖర్ గంగపుత్ర, విజయకుమార్‌గౌడ్,అంబాల నారాయణగౌడ్‌లు పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 శాతం బీసీలకు విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్‌తో పాటు 42 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని సర్పంచ్ ఎన్నికల్లో 17 శాతం కూడా ఇవ్వలేకపోయిందని మండిపడ్డారు. బీసీలను నిండా ముంచిన కాంగ్రెస్ పార్టీకి బీసీలు ఎందుకు ఓటు వేయాలని వారు నిలదీశారు. 42 రిజర్వేషన్స్ పార్టీ పరంగా ఇస్తామని బీసీ మంత్రి ద్వారా ప్రకటనలు ఇప్పించిన ముఖ్యమంత్రి ఎక్కడ కూడా ఆపార్టీ బిసి శ్రేణులకు టికెట్లు ఇచ్చిన సందర్భాలు కనిపించడంలేదని విమర్శించారు. పైగా జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ నేతలపైన దాడులు చేయడం మరి పైశాచికంగా నల్లగొండ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి అయిన దంపతులపై దాడులు చేసి చిత్రహింసలు పెట్టి భయభ్రాంతుల గురి చేయడం జరిగిందన్నారు. మరోపక్క జనరల్ స్థానాలలో పోటీ చేస్తున్న బీసీలతో పోటీ పడలేక ఓటుకు నోటు విధానాన్ని కొనసాగిస్తూ 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు వేలం వేస్తున్న ఘటనలు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు కాంగ్రెస్ ముసుగులో రెడ్డి సామ్రాజ్యాన్ని నిర్మించాలని కుట్ర చేస్తున్న రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని వారు పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకలి వేలుతో పెగలిస్తామని, బీసీల ఆగ్రహావేశాలకు గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు సింగం నాగేష్‌గౌడ్, బోయ గోపి పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నిఖిత ఏకప్రాతాభినయనం

**సైఫాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త:** నిఖితా నయనాలలో భావం, ఆమె కరములలో సంగీతం, పాదాలలో లయ, నడకలో కథ, ఆత్మలో నృత్యం ప్రస్ఫుటమైందనందనడంలో ఏలాంటి అతిశయోకి లేదు, అందుకే ఆమె అభినయానికి ప్రేక్షకులు మంత్రముగ్దులయ్యారు. ఆమె నృత్య కౌశలానికి ప్రేక్షకులు పరవశించిపోయారు. ఎంతో మంది కళాభిమానులను అలరించిన ఈ అద్భుత నృత్య ప్రదర్శన ఆదివారం సాయంత్రం బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో కొనసాగింది. 'నవ జనార్థన పారిజాతం' అనే ప్రత్యేక ప్రబందాన్ని నర్తనశాల తరపున సాయినిఖితా కాటూరి ఏకపాత్రాభినయం ఎంతగానో ప్రేక్షకులను అకట్టుకుంది. ఆంధ్రా నాట్యం మహోపాధ్యాయుడు, పద్మశ్రీ నటరాజ రామకృష్ణ పునరావిష్కరించి, లిఖితరూపం ఇచ్చిన ఈ నృత్య రూపకాన్ని ఆయన శిష్యుడు గురవు కళాకృష్ణ నృత్య దర్శకత్వంలో ఈ ప్రదర్శన జరిగింది. ఇందులో ప్రమాణికమైన ఆంధ్రనాట్యం సంప్రదాయాన్ని నిలబెడుతూ అందులోని సూ క్ష్మమైన అభినయాన్ని జతులను నర్తికి అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను అకట్టుకున్నారు.

## మన్ కీ బాత్‌లో కరీంనగర్ ప్రస్థావన



ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని

**చిక్కడపల్లి నవంబరు 30 (ప్రభాతవార్త) :** ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమానికి ఎంతో ప్రత్యేకత ఉందని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. ఆదివారం 128 వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, డివిజన్ పార్టీ నేతలతో కలిసి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వీక్షి ంచారు.ఈ సందర్భంగా ప్రధాని కరీంనగర్ ప్రస్తావన తీసుకొచ్చారు. కరీంనగర్‌లో ఉత్పత్తి చేసిన సాంప్రదాయ కళాకృతులను వివిధ దేశాధినేతలకు బహుకరించానని ప్రధాని తెలుపడం కరీంనగర్‌లో ప్రసిద్ధి చెందిన సిల్వర్‌తో తయారైన బుద్ధుడి ప్రతిమను జపాన్ ప్రధానికి బహుకరించానన్నాని, . అలాగే కరీంనగర్‌లో రూపు దిద్దుకున్న పూల ఆకృతితో ఉన్న సిల్వర్ మిర్రర్‌ను.. ఇటలీ ప్రధానికి బహుకరించానని ప్రధాని మోదీ మన్‌బాత్‌లో తెలిపారు.128వ మన్ కి బాత్ లో తెలంగాణలోని కళాకృతులను అభినందించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు,టి గోపాల్, రత్న సాయి చంద్, దామోదర్, శ్రీకాంత్, ఎం.ఉమేష్,మహమూద్,సురేష్ రాజు,శివ కుమార్ ఆనంద్ రావు,నీరజ్ సాయి కుమార్, జ్ఞానేశ్వర్, బూత్ అధ్యక్షులు,పలు మోర్చల అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

**ఉప్పల్, నవంబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీ గిరిధారి కూచిపూడి డాన్స్ అకాడమీ గురువు శ్రీలత శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా లలిత హారతి, వినాయక కౌతం, శ్లోకాంజలి, గరుడగమనా , అదిగో భద్రాద్రి, జనుత శబ్దం, కళ్యాణ రామ, స్వాగతం కృష్ణ, నమో నరసింహ, జగదపు జాజర, బ్రహ్మాంజలి తదితర అంశాలను కళాకారులు నీవంశీ, మనస్వి, నిత్య, సహస్ర, దీక్షి త, యోచన, తాన్విక, మహశ్రీ, భూవాన్యా, వర్ష శ్రీ , దేవి రెడ్డి, యాషిక తదితరులు ప్రదర్శించి మెప్పించారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## గాంధీ ఆస్పత్రి రోగి సహాయకులకు అన్నదానం

**సికింద్రాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త:** అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి ఆధ్వర్యంలో పంజాగుట్ట నిమ్స్, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణాల్లో రోగి సహాయకులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నగరం నలుమూలలతోపాటు తెలంగాణ జిల్లాలకు చెందిన నిరుపేద రోగి సహాయకులు, అన్నార్తులు, అభాగ్యులకు శబరిగిరీశుని అశీస్సులతో అన్నదానం చేయడం తమవంతు కర్తవ్యంగా భావిస్తున్నామని, దశాబ్ధకాలంగా అనేక సామాజిక, ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చింతల్ అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి అధ్యక్షులు వెంకటేష్ (బొంబాయి గురుస్వామి), ప్రధాన కార్యదర్శి పుల్లారావు, కోశాధికారి కేవీ రాజేంద్ర ప్రసాదరావు, ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, మహేష్, వెంకట సుబ్బారావు, సాయి భార్గవి, రాణి, రూప్‌కుమార్, నాగయశస్వీ,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ క్రికెట్ అకాడెమీలో క్రీడాకారులకు ఉచిత వైద్య పరీక్షలు

**సరూర్‌నగర్, నవంబరు 30 ప్రభాతవార్త:** నగర శివార్లలోని జిల్లెలగూడలోనున్న గ్లోబల్ క్రికెట్ అకాడెమీలో ఆదివారం ఉచిత ఆరోగ్యశిబిరాన్ని నిర్వహించారు. దక్కన్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో క్రీడాకారులకు ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతోపాటు బ్లడ్‌గ్రూపు పరీక్షలు చేశారు. ఈ శిబిరం ఏర్పాటు సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్రీడాకారులు విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సి న అవసరం ఉందన్నారు. సమాజంలో ఆరోగ్య పరిరక్షణ, అవగాహన కోసం దక్కన్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, గ్లోబల్ క్రికెట్ అకాడెమీ కోచ్‌లు, సిబ్బంది, వైద్య బృందం పాల్గొన్నారు.